క్లుప్తంగా

రేడియం స్టిక్కర్ లేని వాహనాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో రేడియం స్టిక్కర్లు లేకుండా వెళుతున్న ట్రాక్టర్లపై పలమనేరు పోలీసులు శుక్రవారం తనిఖీలు చేశారు. పలు ట్రాక్టర్లు, ట్రాలీలకు అక్కడిక్కడే రేడియం స్టిక్కర్లును అంటించారు. 'నిర్లక్ష్యానికి తప్పదు మూల్యం' శీర్షికతో ఈనెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనంపై స్థానిక డీఎస్పీ సుధాకర్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలతో పట్టణ సీఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలసి హైవేలో పలు ట్రాక్టర్లను తనిఖీ చేశారు. చాలా ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టిక్కర్లు వేసుకోకపోతే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీరాములు

సదుం: మండలంలోని చింతపర్తివారిపల్లె పాఠశాలకు ఏబీసీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై సుమలత నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కెచ్ పెన్నులు తదితర సామగ్రిని ఎంఈఓ శ్రీరాములు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, టీచర్లు మోహన్ కుమార్‌రెడ్డి, కృష్ణమూర్తి, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి మరో ఇద్దరు ఎంపిక



మిస్బా, చరణ్‌తేజ

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారని హెచ్‌ఎం సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన మిస్బా, గౌతమ్ చరణ్ తేజ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపిక అయ్యారని చెప్పారు.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి..



మెహక్ పూజ రిషి

రొంపిచెర్ల: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు వైఎస్సార్ కడప జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పూజ 572, ఎస్.రిషి 562, మెహక్ 565 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారు. వారిని ఎంఈఓ శ్రీనివాసులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సరళ, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, తల్లిదండ్రులు, టీచర్లు అభినందించారు.

16న విజయవాడలో మహాసభ



పలమనేరు: ఈనెల 16న విజయవాడలో మరో గ్రంథాలయ ఉద్యమ మహాసభ నిర్వహిస్తారని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను స్థానిక కళామందిరంలో సమితి సభ్యులతో కలసి ఆవిష్కరించారు. జిల్లాలోని తెలుగు సాహిత్య, భాషాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్కదేవతలకు ప్రత్యేక పూజలు



గ్రామ సమీపంలో ప్రతిష్ఠించిన అక్కదేవతల ప్రతిమలు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో అక్కదేవతలకు శుక్రవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అక్కదేవతల ప్రతిమలను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ సమీపంలో ప్రతిష్ఠించారు. వర్షాలు బాగా కురిసి , పంటలు సమృద్ధిగా పండాలని మొక్కారు. ప్రతి ఏటా పూజలు చేయడం ఇక్కడ ఆనవాయితీ.

శాకాంబరీ దేవి అలంకారంలో చౌడేశ్వరీదేవి



ప్రత్యేకాలంకారంలో చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం ఆషాఢం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రఘునాథ రావు అమ్మవారికి అభిషేకం, అర్చన అనంతరం వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. శాకాంబరీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సేవకు సలాం



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే చేర్చింది. టీడీపీ పాలనలో ఒక సర్టిఫికెట్ పొందాలన్నా వారాల తరబడీ కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇక పింఛనుదారుల వద్ద కష్టాలు చెప్పనలవికావు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చి పడిగాపులు కాయాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ఇబ్బందులు లేకుండా చేసింది. వలంటీర్లతో ఠంచనుగా తెల్లవారుజామునే పింఛనే కాకుండా అవసరమైన సేవలన్నీ ఇంటి ముంగిటే పొందేలా చేసింది. ఫలితంగా వలంటీర్ల వ్యవస్థ అందరి ప్రశంసలు అందుకుంటోంది. దీంతో ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరిగింది. అయితే ఈ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొన్నిరోజులుగా విషం చిమ్ముతూనే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు భగ్గుమంటున్నా ఆయన తీరు మారలేదు. ఈ నేపథ్యంలో వలంటీర్ల సేవలపై కథనం.

– పలమనేరు

తల్లిలా వలంటీర్ లాలన



తన ఇంటి ముందు బుద్ధిమాంద్యం బాలిక రిషిని చూసుకుంటున్న వలంటీర్ కవిత

మండలంలోని సముద్రపల్లెకు చెందిన శ్వేత, విజయ్ దంపతులకు బుద్ధిమాంద్యం కలిగిన కుమార్తె రిషిత(8) ఉంది. ఆ బాలిక వైద్య ఖర్చుల కోసం ప్రతినెలా వలంటీర్ ద్వారా డీఎంహెచ్‌ఓ పింఛను రూ.5వేలు అందుతోంది. బాలిక తండ్రి సమీపంలోని ఓ పాల డెయిరీలో కార్మికుడిగా, తల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా పనిచేస్తోంది. తమ కుమార్తెను ఇంటి వద్ద ఉంచి ఇరుగు పొరుగు వారికి చెప్పి వెళ్లేవాళ్లు. ఇది గమనించిన వలంటీర్ కవిత తన పనులు ముగించుకుని, వారు వచ్చే వరకు ఆ పాప సంరక్షణ బాధ్యతను తాను స్వీకరించింది. రిషిని తన ఇంటికి తీసుకెళ్లి చూసుకుంటోంది. దీంతో పాటు ప్రతినెలా ఆస్పత్రిలో చికిత్సకు సైతం తీసుకెళ్లి వైద్యం చేయించి ఇంటికి తీసుకొస్తోంది. దీంతో శ్వేత దంపతులు నిశ్చింతగా తమ పనులకు వెళ్తున్నారు.

సొంత బిడ్డలా చూస్తుందయ్యా!



మా పాపకు బుద్ధిమాంద్యం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న పింఛనుతో ఆస్పత్రిలో చూపిస్తున్నాం. నేను, మా ఆయన పనులకు వెళితేగానీ కుటుంబ గడవదు. దీంతో పాపను చూసుకోవడం, ట్రీట్‌మెంట్ ఇప్పించడం సమస్యగా మారింది. మా బాధను గమనించిన మా వలంటీర్ కవిత మేం పనులకు వెళ్లగానే అన్నీ తానై సాయంత్రం వరకూ చూసుకుంటోంది. ఆస్పత్రికి కూడా తీసుకెళ్తోంది. తోబుట్టువూ కాదు; బంధువూ కాదు.. సొంతవాళ్లలా చూసుకుంటోందయ్యా మా పాపను. వలంటీర్లకు పెట్టిన జగనన్నకు మేమంతా రుణపడి ఉంటాం.

వలంటీర్లను ఆడిపోసుకుంటే పుట్టగతులుండవ్



షామీరాకు పింఛను ఇస్తున్న వలంటీర్ ప్రేమ కుమారి

ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు షామీరా. మండలంలోని గంటావూరుకు చెందిన ఆమెకు వృద్ధాప్య పింఛను వస్తోంది. గత ప్రభుత్వ పాలనలో పింఛను కోసం పోస్టాఫీసు లేదా సెల్ నెట్‌వర్క్ ఉండే ప్రదేశానికి వెళ్లి ఇబ్బందులు పడేది. ఒక్కోసారి అన్నం కూడా లేకుండా రోజంతా పడిగాపులు కాసేది. వలంటీర్లు వచ్చాక ఇప్పుడా అగచాట్లు లేవు అని ఆనందంగా చెబుతోంది. ప్రతినెలా మొదటి తేదీనే వలంటీర్ ప్రేమకుమారి ఇంటికొచ్చి, తలుపుతట్టి, అవ్వా పింఛను తీసుకో అని ఇచ్చి, కాసేపు యోగక్షేమాలు తెలుసుకుని వెళ్తోందని చెప్పింది. మాలాంటోళ్లకు వలంటీర్లతో జగను ఎంతో మేలు చేసినాడు అని గర్వంగా చెబుతోంది. వలంటీర్లను ఆడిపోసుకుంటే పుట్టగతులుండవవయ్యా అని పవన్ కళ్యాణ్‌ను తిట్టిపోసింది.

బొమ్మరాజుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళీకృష్ణ

పెద్దపంజాణి: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం బొమ్మరాజుపల్లె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. రక్తహీనత ఉన్న వారికి ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

అంగన్‌వాడీ ఆయా నియామకం



అంగన్‌వాడీ ఆయాకు నియామక పత్రం ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

రొంపిచెర్ల: మండలంలోనికుమ్మరపల్లె అంగన్‌వాడీ ఆయాగా ఎంపికైన మీనాకు శుక్రవారం నియామక పత్రాన్ని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, నాయకులు డాక్టర్ శ్రీనాథ్, విజయభాస్కర్ రెడ్డి, కరీముల్లా, శ్రీనాధనాయుడు, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ



వైఎస్సార్ బీమా సొమ్ము అందజేస్తున్న నాయకులు

గంగవరం: మండలంలోని తెట్టిమిట్టకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శంకరయ్య(39) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని భార్య అనిత గృహసారథిగా పనిచేస్తోంది. సమాచారం అందుకున్న సర్పంచ్ గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, చిట్టి తదితరులు శుక్రవారం శంకరయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి భార్యకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేలను అందజేశారు.

జోరుగా 'జగనన్న సురక్ష'



పెద్దపంజాణి: సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో నేతలు, అధికారులు



వి.కోట: సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్



పలమనేరు : పాతపేట రాధాబంగ్లా సచివాలయంలో



గంగవరం : సర్టిఫికెట్లు ఇస్తున్న అధికారులు, నేతలు



పుంగనూరు: మంగళంలో..



చౌడేపల్లె : మాట్లాడుతున్న రుక్మిణమ్మ



సోమల: ఇరికిపెంటలో..



రొంపిచెర్ల : మాట్లాడుతున్న సర్పంచ్ ఇబ్రహీంఖాన్

- 405మందికి సర్టిఫికెట్ల పంపిణీ

పలమనేరు: స్థానిక పాతపేట రాధాబంగ్లా సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్జీదారులకు 405 సర్టిఫికెట్లను మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు పంపిణీ చేసి మాట్లాడారు. 11 రకాల ఉచిత సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ కిరణ్, కౌన్సిలర్లు రాజేష్, శ్యాం సుందర్‌రాజు, కోదండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు సచివాలయాల్లో 908..

గంగవరం: మండలంలోని కొత్తపల్లె, జీడిమాకులపల్లె గ్రామ సచివాలయాల్లో ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. కొత్తపల్లె సచివాలయంలో 204, జీడిమాకులపల్లెలో 704 మందికి వివిధ ధృవపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, మండల స్పెషలాఫీసర్ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తహసీల్దార్ అమర్నాథ్, జీడిమాకులపల్లె సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపీటీసీలు సుజాత, సుమిత్రమ్మ, నాయకులు చంద్రప్ప, చిట్టి, వినోద్‌రెడ్డి, రెడ్డెప్ప, నరసింహారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కొళత్తూరులో 275..

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరులో సర్పంచ్ రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు మొత్తం 271 వివిధ సర్టిఫికెట్లను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపీడీఓ భాస్కర్, ఈఓపీఆర్డీ పవన్ కుమార్, పీఎస్ వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ప్రసాద్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంభార్లపల్లెలో 147..

వి.కోట: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలో కుంభార్లపల్లె పంచాయతీ గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష నిర్వహించారు. 147 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ మురుగేష్, నాయకులు సురేంద్రగౌడు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీరాముల గౌడు పాల్గొన్నారు.

పుంగనూరు నియోజక వర్గంలో..

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాలలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు జగనన్న సురక్ష బృందం కృషి చేస్తోందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంగళంలో జగనన్న సురక్ష గ్రామ సభను ఏఎంసీ చైర్మన్ అమరనాథ రెడ్డి, పీకెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి నిర్వహించారు. లబ్ధిదారులకు ధృవపత్రాలు, జగనన్న సురక్ష పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజారెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమినిగుంటలో 53 సర్టిఫికెట్లు..

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంట సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో లబ్దిదారులకు మొత్తం 53 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ, ఎంపీపీ రామమూర్తి తదితరులు మాట్లాడారు. వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్ సావిత్రి, ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపీడీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరికిపెంటలో 541..

సోమల: ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇరికిపెంట సచివాలయ పరిధిలో ఎంపీటీసీ సభ్యుడు వేముల హరినాథ్, సర్పంచ్ రెడ్డప్ప ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 541మందికి వివిధ సర్టిఫికెట్లను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఎంపీడీఓ నాగరాజ, ఆర్ఐ సుబుక్తుల్లా, ఏఓ సుధాకర్, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, వైఎస్సార్ సీపీ నేతలు బగ్గిడి నాగరాజ, మధుసూదన్ నాయుడు, సూరిరెడ్డి, గండికోట రాజ, వాటర్‌షెడ్ చైర్మన్ బ్యాంక్ రమణ, కార్యదర్శి మేనక పాల్గొన్నారు.

రొంపిచెర్ల-2లో 568..

రొంపిచెర్ల: రొంపిచెర్ల-2 గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 568మందికి వివిధ ధృవపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ ఇబ్రహీంఖాన్ మాట్లాడారు. రొంపిచెర్లలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాధరెడ్డి, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్ అమరనాథ్, ఎంపీటీసీలు సిరాజున్నీసా, రహీమాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, నారాయణ రెడ్డి, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలు సాధించకపోతే చర్యలు



వెంకటదాసరపల్లెలో మామిడి మొక్కకు నీరు పోస్తున్న గంగాభవాని

సదుం: ఉపాధి హామీ పథకంలో నిర్దేశిత లక్ష్యాలను ఫీల్డ్ అసిస్టెంట్లు సాధించకపోతే చర్యలు తప్పవని పీడీ గంగాభవాని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీలో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, లక్ష్యాలలో వెనుకబడ్డ పూతలపట్టు సిబ్బంది పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. నెలాఖరులోపు పండ్లతోటల పెంపకానికి సంబంధించి ప్లాంటేషన్ పూర్తి చేయాలని, ఎస్సీ, ఎస్టీ కూలీలకు వంద రోజుల పని కల్పించాలని ఆదేశించారు. తొలుత బూరగమంద క్రాస్ నుంచి గ్రామం వరకు ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ శివశంకర్ పాల్గొన్నారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): రైతులు ఉపాధి హామీ పథకంలో నాటిన మామిడి మొక్కలను పూర్తి స్థాయిలో సంరక్షించాలని ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని కోరారు. శుక్రవారం ఆమె మండలంలోని వెంకట దాసరపల్లె, బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో ఉపాధిలో నాటిన మామిడి మొక్కలను పరిశీలించారు. సర్పంచులు లక్ష్మి, నాగమ్మ, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ సౌకత్‌అలీ, ఈసీ క్రిష్ణ, దామోదర్, దామోదర్‌రెడ్డి, కోదండ, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు వీడ్కోలు సన్మానం



గంగవరం : జీడిమాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో..



పలమనేరు : హెచ్‌ఎంను సన్మానిస్తున్న సర్పంచ్

గంగవరం: మండలంలోని జీడిమాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దయానంద, లక్ష్మీనారాయణ బదిలీ కావడంతో శుక్రవారం వారిని సన్మానించి వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం రాజయ్య, ఎస్‌ఎంసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న టీచర్లు పాఠశాలకు రూ. 20వేల విలువ చేసే మైక్‌సెట్, యాంప్లిఫైర్‌ను వితరణ చేశారు. నాయకులు రెడ్డెప్ప, నరసింహారెడ్డి, సీఆర్‌పీ వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మండలంలోని కూర్మాయి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ బదిలీ అయిన స్వామినాధన్‌ను గ్రామ సర్పంచు చెంగమ్మ శుక్రవారం ఘనంగా సన్మానించారు. వీడ్కోలు సమావేశంలో ఆయన సేవలను కొనియాడారు. సచివాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



పెంగరగుంట ఆర్‌బీకేలో పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పలమనేరు: ఆర్‌బీకే సిబ్బంది కేంద్రాల్లో రైతులకు అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని పెంగరగుంట, కూర్మాయి ఆర్‌బీకేలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఏడీ కార్యాలయంలో మండలంలోని 12 రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌలు రైతులకు కౌలు ధ్రువపత్రాలను ఇవ్వాలని ఆదేశించారు. చెప్పారు. రైతులు సాగు చేసిన పంటలకు ఉచిత ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సంధ్య పాల్గొన్నారు.

రాయితీపై చిరుధాన్యాలు



మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్



వి.కోట : మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

గంగవరం: రైతులు రాయితీపై చిరుధాన్యాలను పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకేలో మండలంలోని ఆర్‌బీకే సిబ్బందికి సమావేశం నిర్వహించి ఏడీఏ మాట్లాడారు. చిరుధాన్యాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులు రాగి పంట సాగుపై మొగ్గు చూపేలా ప్రోత్సహించాలన్నారు. పుంగనూరు డివిజన్‌కు 49 క్వింటాళ్ల రాగులను ప్రభుత్వం సరఫరా చేస్తోందని మార్కెట్‌లో కిలో రూ.69.50 ఉండగా, రాయితీపై రూ. 34.75కే రెండు కిలోల బ్యాగును ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల రైతులు సంబంధిత కార్యాలయాల్లో ఆధార్ కార్డుతో విత్తనాలు పొందవచ్చన్నారు. వ్యవసాయ పెట్టుబడి సాయం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి హేమలత, మండల సెరికల్చర్ ఆఫీసర్ విమల, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

వి.కోట: మల్బరీ రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యువరాజు అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సెరికల్చర్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో మల్బరీ తోటల పెంపకానికి, షెడ్ల నిర్మాణానికి ఇచ్చే సొమ్మును గురించి తెలియజేశారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుప్పం ఏడీఎస్ హనుమంతరాయప్ప, ఎంపీడీఓ వినోద పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం

స్థానిక స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం ఎంపీపీ యువరాజు ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఎస్సీ, ఎస్టీ సంబంధించి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ రుణాలను వివరించారు. తహసీల్దార్ చిట్టిబాబు, మండల అధికారులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మైనారిటీల అభ్యున్నతి



జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న అమ్ము

పుంగనూరు: రాష్ట్రంలో మైనారిటీ అభ్యున్నతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, మైనారిటీలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము అన్నారు. శుక్రవారం యూబి కాంపౌండులో ఆయన ఇంటింటికీ జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించి సమాచార పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం రూరల్: కుప్పం మండలంలోని అడవిబూదుగూరు హెచ్‌డబ్ల్యూ, రాగిమానుమిట్ట గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ అరుణశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గ్రామంలో నివాసం ఉండి పదవ తరగతి పాసై ఉండాలన్నారు. వివాహిత మహిళలు రోస్టర్ విధానాన్ని అనుసరించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17వ తేది నుంచి 22వ తేదీ లోపు దరఖాస్తులను ఇవ్వాలన్నారు. దరఖాస్తులు కుప్పంలోని కేంద్ర కార్యాలయంలో పొందవచ్చన్నారు.

శాంతిపురం, రామకుప్పం మండలాల్లో..

శాంతిపురం: ఖాళీగా ఉన్న ఆరు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ కల్పన తెలిపారు. మండలంలోని శ్యామరాజపురం(బిసి-బి), డిటి పల్లె (ఓసి) మినీ కేంద్రాలకు అంగన్‌వాడీ వర్కర్లు కావాలన్నారు. అలాగే శివకురుబూరు(బిసి-బి), నక్కనపల్లె (ఓసి), 121పెద్దూరు(ఓసి), రామకుప్పం మండలంలోని కెంపసముద్రం(ఓసి) కేంద్రాలలో అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా గ్రామాలలోని 10 వ తరగతి పాసైన వివాహిత మహిళలు రోస్టర్ రిజర్వేషన్ పాటిస్తూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 22వ తేదీ లోపుగా తమ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.